రెండో అన్నవరం.. రంగాపురం!

- క్షేత్రంలో కొలువైన భూదేవి, నీలాదేవి సమేత సత్యనారాయణ స్వామి
- కార్తీక, ధనుర్మాసాల్లో అధిక సంఖ్యలో వ్రతాలు
- వ్రతం ఆచరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం


రంగాపురంలో సత్యనారాయణ స్వామి ఆలయం


రంగాపురంలో వేంచేసిన భూదేవి, నీలాదేవి సహిత సత్యనారాయణస్వామి

లింగపాలెం: రెండవ అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహిస్తారు. రంగాపురం సత్యదేవుని ఆలయంలో వ్రతాలను ఆచరించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజలు పెళ్లి, పేరంటం, గృహ ప్రవేశం రోజున సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తారు. ఆ ఇంటి ఇలవేల్పుతోపాటు సత్యనారాయణ స్వామికి భక్తులు మొక్కు చెల్లించుకుంటారు. సకల శుభాలకూ కారకుడైన స్వామిని కొలిస్తే సుఖసంతోషాలతో ఆ ఇల్లు వర్ధిల్లుతుందని భక్తుల నమ్మకం. సత్యనారాయణ స్వామి అనగానే ఉమ్మడి తూర్పుగోదావరిలోని అన్నవరం గుర్తొస్తుంది. అదే తర హాలో రంగాపురంలో నిత్యం సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తారు. ఇక్కడ సంతానం లేని జంటలకు ఇచ్చే గరుడ ప్రసాదం మరింత ప్రసిద్ధి.

2006లో ఆలయం పునర్నిర్మాణం

1056లో ఇక్కడ కొలువైన స్వామివారి విగ్రహాన్ని భక్తులు కొలిచేవారు. ఆ తర్వాత కామేశ్వరమ్మ ఆమె సోదరులు కామేశ్వరరావు గౌరి శంకర దత్తుల సహాయంతో పలు గ్రామాల్లోని భక్తుల సహకారంతో త్రిదండి రామానుజ పెద్ద జీయరుస్వామి చేతుల మీదుగా 1961లో సత్యదేవుని ఆలయాన్ని నిర్మించారు. అప్పుడే భూనీలా సహిత సత్యనారాయణ స్వామి రాజ్యలక్ష్మి అమ్మవారిని, గోదాదేవిని అళ్వారులను ప్రతిష్ఠించారు. కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2006లో పునర్నిర్మాణం పూర్తి చేసి చిన్న జీయరు స్వామి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల విగ్రహాలను కూడా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు.

సంతాన ప్రసాదంగా ప్రసిద్ధి

స్వామి బ్రహ్మోత్సవాలు వైశాఖ శుద్ధ దశమి నుంచి పదిరోజుల పాటు నిర్వహిస్తారు. వైశాఖ శుద్ధ ద్వాదశి విధియల్లో నిర్వహించే ధ్వజారోహణ, అవరోహణ కార్యక్రమాల్లో భక్తులకు అందించే గరుడ ప్రసాదానికి విశిష్ట ప్రాధాన్యత ఉంది. ఆరోజు బియ్యం, పెసరపప్పు, నెయ్యి తదితర పదార్థాలతో చేసిన గరుడు ప్రసాదాన్ని స్వామి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి పూజల అనంతరం సంతానం లేని జంటలకు పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదం తీసుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ క్షేత్రంలో గోధుమ రవ్వ, నెయ్యితో తయారుచేసే ప్రసాదం అన్నవరం తరహాలోనే ప్రత్యేక రుచిని కలిగి ఉంటుంది.

రామక్రతు,యజ్ఞ స్తూపాల నిర్మాణం

ప్రపంచశాంతిని కాంక్షించే రామక్రతు స్తూపం, యజ్ఞ స్తూపాలు రెండూ ఒకే చోట ఉన్న క్షేత్రాలు దేశంలో మూడు మాత్రమే ఉన్నాయని రంగాపురం ఆలయ అర్చకులు చెబుతున్నారు. అందులో రంగాపురం ఒకటి. మిగిలినవి తిరుమల తిరుపతి, భద్రాచలం ఆలయం. రంగాపురం ఆలయ ప్రాంగణంలో 1977లో ప్రపంచశాంతి కోసం జ్ఞాన యజ్ఞం చేసిన అనంతరం రామక్రతు స్తూపం, యజ్ఞ స్తూపాలను ప్రతిష్ఠించారు. రెండు రాష్ట్రాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి భక్తులు వచ్చి వ్రతాలు ఆచరిస్తుంటారు. కార్తీక, ధనుర్మాసాల్లో ఇక్కడ వ్రతం ఆచరిస్తే సర్వకార్యాలూ సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తుల రాక



కార్తీక మాసంలో రంగాపురం సత్యనారాయణ స్వామి ఆలయానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి వ్రతాలు ఆచరిస్తారు. సంతాన సాఫల్య దేవుడిగా, కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు సత్యనారాయణ స్వామిని కొలుస్తారు.

– శేషాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు, రంగాపురం

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు



భూదేవి, నీళాదేవి సమేతుడైన సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. గతంలో కార్తీక మాసంలో దేవాలయ మండపంలో రోజుకు 80 జంట్లకు పైగా వ్రతాలు ఆచరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా మండపం దిగువ భాగంలో మరికొంత మంది వ్రతాలు ఆచరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

– యస్ గోపి, ఆలయ ప్రధాన గుమస్తా, రంగాపురం

క్లుప్తంగా

మట్టి అక్రమ తవ్వకాలపై అధికారుల సర్వే


జగన్నాథపురంలో అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరి కొండ దిగువన జరిగిన మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు దృష్టి సారించారు. శనివారం తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని పరిశీలించి కొలతలు నమోదు చేశారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నారసింహాడి క్షేత్రాన్ని సందర్శించిన సందర్భంగా మట్టి అక్రమ తవ్వకాలను పరిశీలించి దీనిపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. హైవే నిర్మాణ పనులకు ఈ మట్టిని ఎంత మేరకు వినియోగించారు. బయటకు ఏమైనా తరలిపోయిందా తదితర వివరాలతో పాటు ఈ ఆలయానికి ఉన్న 50 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే పనులు చేపట్టారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎంవీ రమణ, సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఏడీ ఎస్కే మహ్మద్ అన్సారీ ముబారక్, తహసీల్దార్ సుబ్బారావు, మైన్స్ ఏడీ ఉన్నారు.

మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం

టి.నరసాపురం: బొర్రంపాలెంలో మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. మత్స్య శాఖ అభివృద్ధి అధికారి పి.ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా బత్తుల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కొత్తూరి వేంకటేశ్వరరావు, కార్యదర్శిగా మల్కి సురేష్‌తో పాటు మరో ఆరుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ మత్స్య సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంఘ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్ది అంజన్నను దర్శించుకున్న ఉప కమిషనర్ విశ్వనాథరాజు


స్వామి వారి చిత్రపటాన్ని విశ్వనాథరాజుకు అందజేస్తున్న ఆలయ అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానాన్ని శనివారం తలుపులమ్మ అమ్మవారి ఆలయ ఈవో, ఉప కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మద్ది ఆలయ సహాయ కమిషనర్ ఆర్వీ చందన ఆలయ మర్యాదలతో ఉప కమిషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాలను విశ్వనాథరాజుకి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం నుంచి దేవులపల్లి వైపు వెళ్లుతున్న ఆటో గురవాయిగూడెం శివారులో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ ఇంజన్ భాగాన్ని ఢీకొని ఎదురుగా వస్తున్న మరో స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న పుట్లగట్లగూడెంకు చెందిన పారేపల్లి నాగేశ్వరరావు, లక్కవరానికి చెందిన ఆకుల వెంకటేశ్వరరావుకు స్వల్ప గాయాలు కాగా స్కూటీపై వెళుతున్న పావనికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ జంగారెడ్డిగూడెంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆదాయ పన్ను ఈ- ఫైలింగ్‌పై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగంలో అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఇన్‌కమ్ ట్యాక్స్ ఈ–ఫైలింగ్ అనే అంశంపై చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థ సభ్యులతో అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆదాయ పన్ను అనేది కామర్స్ విభాగ విద్యార్థులకు చాలా అవసరమైన సబ్జెక్ట్ అన్నారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.ఉత్తమసాగర్ మాట్లాడుతూ ఆదాయ పన్ను సమర్పించే ప్రతి ఒక్కరికీ ఈ– ఫైలింగ్‌పై అవగాహన అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి. శ్రీనివాసరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.మధు, కామర్స్ విభాగ అధ్యాపకులు సీహెచ్.రమాదేవి, కేవీవీ శిరీష, కామర్స్ విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్లాసికల్ చెస్ రేటింగ్ ప్లేయర్‌గా శశి ప్రియాంక


శశి ప్రియాంక

జంగారెడ్డిగూడెం: అంతర్జాతీయ క్లాసికల్ చెస్ రేటింగ్ ప్లేయర్‌గా శశి ప్రియాంక గుర్తింపు సాధించింది. జంగారెడ్డిగూడెంలోని దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ ప్లేయర్ చిరంజీవి తురసం శశి ప్రియాంక ఇటీవల భీమవరం, విజయవాడలో నిర్వహించిన రేటింగ్ చెస్ టోర్నమెంట్లలో పాల్గొని ప్రతిభ కనపరచి 1,408 రేటింగ్ సాధించింది. అంతర్జాతీయ క్లాసికల్ చెస్ రేటింగ్ ప్లేయర్ శశిప్రియాంకను చెస్ కోచ్ అయినపర్తి సరళామాధవి, సామాజిక వేత్త కె.ఎల్.ఎస్.ధన కుమార్, రోటరీ సభ్యులు ఎ.చంద్రశేఖర్, తల్లిదండ్రులు అభినందించారు.

పట్టిసీమ నుంచి నీటి విడుదల


పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కుడి కాలువలోకి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి ట్రయల్ రన్ నిర్వహించారు. ఇటీవల మోటార్‌లు మరమ్మతులు చేసి, పైప్‌లైన్‌లను అధికారులు పరిశీలించారు. శనివారం మోటార్‌ల పనితీరుపై ట్రయల్ రన్ నిర్వహించారు. రెండు మోటార్‌లను ఆన్‌చేసి కుడికాలువలోకి నీరు విడుదల చేశారు. అవసరమైతే కుడికాలువలోకి నీరు విడుదల చేసేందుకు మోటార్‌లను సిద్ధం చేశారు.

మేదర కులస్తులకు వెదురు ఉచితంగా అందించాలి


గవరవరంలో నూతన అసోసియేషన్ నాయకులను అభినందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మేదర కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి అని వంశపారంపర్య వృత్తిని కొనసాగించేందుకు అందుకు కావలసిన వెదురును అటవీ శాఖ ద్వారా ప్రభుత్వమే ఉచితంగా అందజేయాలని మేదర కుల సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గవరవరంలోని మేదరకుల సంక్షేమ భవనం వద్ద శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో చేతి వృత్తిదారులు దీనావస్థలో గడుపుతున్నారని అన్నారు. అనంతరం బాలగణపతి దేవాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీలక్ష్మీ గణపతి మేదర (మహేంద్ర) సంఘం సంఘ ముఖ్య సలహాదారుడిగా కోడే శోభనాద్రి, గౌరవ అధ్యక్షుడు పాత కోట మస్యాద్రి, ప్రెసిడెంట్ శిరిగిరి సూరిబాబు, కార్యదర్శి జొరిగే రామమోహన్‌రావు, కోశాధికారి చందా కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సంఘ పెద్దలు పూలమాలలు వేసి అభినందించారు.

క్రియాశీలక కార్యకర్తను కోల్పోయాం


చొప్పరామన్నగూడెంలో ఆమోష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్తను కోల్పోయిందని, యడ్లపల్లి ఆమోష్ మృతి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శనివారం చొప్ప రామన్నగూడెంలో ఆమోష్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్య కారణాలతో ఆమోష్ మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ తరఫున నిర్వహించిన పాదయాత్రలో పాల్గొని స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆమోష్‌కి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. తగరం ఆశీర్వాదం, గంటా రమేష్, చిరువూరి శ్రీను, బిరుదు గడ్ల ప్రేమ్, కె మోహనరావు, కె బాబ్జి, కె జీవన్, ఎం శాంతారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మేకల అన్నవరాన్ని పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు జెట్టి గురునాథరావు పరామర్శించారు. ఇటీవల అన్నవరం మాతృమూర్తి లక్ష్మీకాంతం మృతి చెందడంతో శనివారం ఆయన నివాసానికి వెళ్లి సంతాపం వ్యక్తం చేసి లక్ష్మీకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు అన్నవరం కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. టౌన్ కన్వీనర్ సంకుకొండ, పార్టీ నాయకులు గంటా శ్రీను, జుంగా బాబ్జి, మారిశెట్టి శ్రీను, పైడి ముక్కల కృష్ణ, చిటికెన నాగార్జున, పూలపల్లి రవి, తొండరాజు, పొలపాకుల దుర్గారావు, పూసల రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


పారిజాతగిరి వాసుడిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో శనివారం కార్తీక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్వీ చందన పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన పారిజాత గిరి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవ మొదలుకుని అర్చకులు స్వామి వారి అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మాలాధారులు స్వామిని దర్శించుకున్నారు. కొయ్యలగూడెం మండలం గవరవరానికి చెందిన భక్తులకు కాలినడకన ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన దివంగత కేతిరెడ్డి అప్పలనాయుడు, ఆయన స్నేహితులు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరి రవికుమారాచార్యులు వారికి వేదాశీర్వాదం అచచారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, వాసవి సాయి నగేష్ పాల్గొన్నారు.

ముక్కంటికి అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: కార్తీకమాసం సందర్భంగా శనివారం జంగారెడ్డిగూడెంలోని శివాలయాలకు భక్తులు తరలివచ్చి ముక్కంటికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని శివాలయాలతో పాటు వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బైనేరు వద్ద ఉన్న ఉమాసహిత రామలింగేశ్వరస్వామి, పేరంపేట రాజరాజేశ్వర స్వామి, స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న శివాలయంలో, గుహాలయంలోని ఓంకారేశ్వరస్వామికి, ముత్యాలమ్మ, నూకాలమ్మ, విజయదుర్గమ్మ, లలితాదేవి ఆలయాల్లో కొలువైన పరమేశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

వీరేశ్వరస్వామికి అభిషేకాలు

పోలవరం రూరల్: కార్తీకమాసం సందర్భంగా భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించి శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శనివారం వీరేశ్వరస్వామికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. క్షేత్రం వద్ద దర్శనానికి వెళ్లిన భక్తులకు ప్రసాదం పంపిణీతో పాటు అన్నదానం చేశారు. భక్తులు స్వామి దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేసినట్లు ఈవో చాగంటి సురేష్ నాయుడు తెలిపారు. పట్టిసం రేవులో భక్తులు లాంచీ ఎక్కి దిగేందుకు వీలుగా ఫెర్రీ కాంట్రాక్టర్ ర్యాంపులు ఏర్పాటు చేశారు. రేవులో పంచాయతీ చేపట్టిన ఏర్పాట్లను ఎంపీడీవో కె.శ్రీనివాస్ పరిశీలించారు. ఉదయం నుంచి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో భక్తులు గోదావరి నదిలో స్నానమాచరించేందుకు వీలుగా రేవులు ఏర్పాటు చేశారు. స్నానఘట్టాల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, విద్యుద్దీపాల ఏర్పాటు పనులు చేపట్టినట్లు సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

నిరుపయోగంగా ధర్మాజీగూడెం బస్‌షెల్టర్


ధర్మాజీగూడెం రోడ్డుపై వానలో బస్‌కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు (ఫైల్)


బస్‌స్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపైనే ఆగుతున్న బస్సులు

- రోడ్డుపై ఆగుతున్న బస్సుల కోసం పరుగు
- వ్యాపారుల ఆక్రమణతో ఇబ్బందులు
- సదుపాయాలు లేక ప్రయాణికులకు తప్పని అవస్థలు

లింగపాలెం: నిత్యం అధిక సంఖ్యలో ధర్మాజీగూడెం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు స్థానిక బస్‌షెల్టర్‌లో ఎటువంటి సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బస్‌షెల్టర్ వ్యాపార సంస్థలకు నిలయంగా మారింది. దీంతో బస్సులు షెల్టర్‌లోనికి రాకుండా రోడ్డుపైనే ఆగుతున్నాయి. బస్సుల వద్దకు పరుగులు తీస్తూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ బస్ షెల్టర్ ప్రస్తుతం వ్యాపార కేంద్రంగా మారింది. ప్రయాణికులు బస్‌షెల్టర్‌కు వెళ్లికూర్చునే వీలు లేకుండా వ్యాపారులు ఆక్రమించారు. నిత్యం ఈ బస్‌షెల్టర్‌కు 4 డిపోలకు చెందిన సుమారు 35 బస్సులు వరకు వచ్చివెళుతుంటాయి. వేలాది మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి ప్రయాణిస్తుంటారు. బస్ వచ్చేంత వరకు రోడ్డుపై నిలబడి ఎండకు ఇబ్బంది పడుతూ, వానకు తడుస్తూ వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇక్కడ దూరప్రాంతం నుంచి వచ్చే ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గతంలో ఇక్కడ పని చేసే కంట్రోలర్‌ను తొలగించారు. కంట్రోలర్ ఉన్న సమయంలో బస్‌స్టాండ్‌లోకి ఆటోవాలాలు దూసుకురాకుండా, వ్యాపారుల ఆక్రమణకు గురికాకుండా కాపాడేవారు. బస్సులు స్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేవారు.

వ్యాపారాలకు మాత్రమే ప్రాధాన్యత

బస్‌స్టాండ్‌లో ప్రయాణికులకు కనీసం కూర్చునేందుకు సౌకర్యాలు కల్పించకుండా వ్యాపారాలకు ప్రాధాన్యతనిస్తున్న ఆర్టీసీ అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటమే ధ్యేయంగా అధికారులు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి, ఎమ్మెల్యేగా గెలుపొందిన సొంగా రోషన్ కుమార్ ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌స్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి



బస్సులు బస్‌స్టాండ్‌లోనికి రాకుండా రోడ్డుపైనే ఆగి నిలబడి ఉన్న ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకుని వెళ్లడంతో మహిళలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇక్కడ ఒక కంట్రోలర్‌ను ఏర్పాటు చేయాలి. మురుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలి.

– నూతులపాటి శ్రీనివాసరావు, ధర్మాజీగూడెం

చర్యలు తీసుకుంటాం

ధర్మాజీగూడెం బస్‌స్టాండ్ పరిస్థితిని పరిశీలిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం. బస్‌స్టాండ్‌లోకి బస్సులు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకునేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. ప్రయాణికుల సౌకర్యార్థం తగు చర్యలు తీసుకుంటాం.

– వాణి, ఆర్టీసీ డిపో మేనేజర్, ఏలూరు

ఎట్టకేలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు,కంభం విజయరాజు (ఫైల్)


జలపవారిగూడెంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన దృశ్యం

కామవరపుకోట: ఎట్టకేలకు కామవరపుకోట నుంచి అంకాలంపాడు, జలపవారిగూడెం, కె.ఎస్. రామవరం వరకు రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టారు. 30 ఏళ్లగా ఆ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారి రాళ్లు పైకి లేచి, ప్రయాణానికి వాహనదారులు నరకయాతన పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, చొరవతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 7.40 కోట్లు నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కొద్ది రోజులకే సార్వత్రిక ఎన్నికలు రావడంతో కోడ్ అమలులో ఉన్నందున రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొంత అంతరాయం అనంతరం ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు, మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కేసరి సరితా రెడ్డి చొరవతో రోడ్డు నిర్మాణం పనులకు పునః ప్రారంభమయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి


యర్రంపల్లిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విజయకుమార్ తదితరులు

చింతలపూడి : రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ అన్నారు. చింతలపూడి మండలం, యర్రంపల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న దేశీ వరి పంటను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేస్తున్న దేశీ వరి సిద్ధి సన్న రకాలపై చర్చించారు. భవిష్యత్తులో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాల్సిన ఆవశ్యకత వస్తుందని అన్నారు. రసాయన రహిత వ్యవసాయంతో ప్రకృతిని కాపాడుకోవచ్చునని సూచించారు. పురుగు మందులు విచ్చల విడిగా వాడటం ద్వారా వాతావరణ కాలుష్యంతో పాటు మనిషి ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతోందని తెలిపారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి తాతారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులు సంప్రదిస్తే తగిన శిక్షణ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్, మండల వ్యవసాయాధికారిణి మీనా కుమారి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.